సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహకార సంఘం అధికారి ధాత్రీదేవి

రైతు భరోసాపై సూచనలు, సలహాలు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

రంగారెడ్డి జిల్లా సహకార సంఘం అధికారి ధాత్రీదేవి

ఇబ్రహీంపట్నం, జూలై 4 : రైతు భరోసా పంపిణీ విషయంలో రైతుల నుంచి వచ్చే సూచనలు, సలహాలను ప్రభుత్వానికి అందజేస్తామని జిల్లా సహకార సంఘం అధికారి ధాత్రీదేవి అన్నారు. గురువారం ఉప్పర్‌గూడ సహకార సంఘం ఆవరణలో రైతు భరోసాపై ఆమె రైతుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు స్థానంలో తీసుకొచ్చిన రైతు భరోసాలో ఎవరెవరికి సహకారం అందిస్తుందనే విషయంపై రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి సూచనలు, సలహాలు తీసుకుంటున్నదని, అందులో భాగంగా జిల్లాలో కూడా అన్ని సహకార సంఘాల పరిధిలో సూచనలు, సలహాలు తీసుకుంటున్నామన్నారు. రైతుల సూచనల మేరకే ప్రభుత్వం రైతు భరోసాపై ఓ నిర్ణయానికి వస్తుందన్నారు.

సహకార సంఘం అధ్యక్షుడు పాండురం గారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రైతు భరోసా అందించాలనే ఉద్దేశంతో సూచనలు, సలహాలు తీసుకుంటున్నదని, మెజార్టీ రైతుల అభిప్రాయం మేరకు రైతు భరోసా అందజేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెద్దపెద్ద రైతులకు, వెంచర్‌లు చేసిన భూములకు కూడా రైతు బంధు ఇచ్చారని, అలాంటివారిని తొలగించి అర్హులైన రైతులకు ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు గ్రహీత రైతు అంజిరెడ్డి మాట్లాడుతూ.. ఐటీ చెల్లించే రైతులకు రైతు భరోసా ఇవ్వొద్దనే నిర్ణయం సరైందికాదన్నారు. ఐటీ చెల్లింపులకు సంబంధం లేకుండా అర్హులైన రైతులకు రైతు భరోసా అందించాలన్నారు. భూమిని సాగు చేస్తున్న ప్రతి రైతుకు రైతు భరోసా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసాకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని 5 వేల నుంచి 15 వేలకు పెంచితే బాగుంటుందని రైతులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, సీఈవో గణేశ్, డైరెక్టర్లు శంకర్, జంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పది ఎకరాలలోపున్న అన్నదాతలకు రైతు భరోసా ఇవ్వాలి

మంచాల : పది ఎకరాలలోపు ఉన్న రైతులందరికీ రైతు భరోసా పథకం వర్తింపజేయాలని రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గురువారం మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పథకం అమలుపై రైతులతో కలిసి ప్రత్యేక మహాజన సభ ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హనుమంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సహాయక అధికారి ధాత్రీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశానుసారం రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. పది ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి జ్యోతిశ్రీ, సహకార సంఘం డైరెక్టర్లు యాదయ్య, వెంకటేశ్, సత్యనారాయణ, వేణుగోపాల్‌రావు, పద్మ, రమేశ్, బ్యాంకు సీఈవో, వీరేశ్, చక్రపాణి, రమేశ్ సంతు, లింగం పాల్గొన్నారు.

సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న సహకార సంఘం చైర్మన్ మహేందర్‌రెడ్డి

ఆదిబట్ల : సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వాలని మంగళ్‌పల్లి సహకార సంఘం రైతులు డిమాండ్ చేశారు. గురువారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లి సహకార సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశం సంఘం చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయాలనుకున్న పంట సాయం ఏ విధంగా.. ఎన్ని ఎకరాల రైతులకు ఇవ్వాలనే అంశంపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా రైతులు వ్యవసాయం చేస్తూ సాగు చేస్తున్న ప్రతి ఎకరానికి రైతు భరోసా ఇవ్వాలని అన్నదాతలు కోరారు. గత ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకం రైతులకు ఎంతో మేలు చేస్తున్నదని రైతులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఏవో వరప్రసాద్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ సరస్వతి, ఏఈవో రఘు, డైరెక్టర్లు యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, యాదమ్మ, శ్రీశైలం, శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.


రైతు భరోసా సమావేశంలో అభిప్రాయాలను సేకరిస్తున్న చైర్మన్ హనుమంత్‌రెడ్డి

ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు

నోటిఫికేషన్ జారీ

వికారాబాద్, జూలై 4 : ఐటీఐ కోర్సుల్లో రెండో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని వికారాబాద్ జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.నరేంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కోర్సులలో 2024-25/26(1, 2 సంవత్సరాలు) విద్యా సంవత్సరానికిగాను కళాశాలల్లో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులందరూ https://iti.Telangana.gov.inలో జూలై 4 నుంచి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9177954208/8555865421 లను సంప్రదించాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని ఆయన సూచించారు.

షాద్‌నగర్‌టౌన్ : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని షాద్‌నగర్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 15 వరకు htpp://iti.telangana.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద విద్యార్థుల ఎంపిక

షాబాద్, జూలై 4 : బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద డే స్కాలర్స్‌గా బాల బాలికలను ఎంపిక చేయడం జరిగిందని రంగారెడ్డిజిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద పాఠశాలల్లో 1వ తరగతిలో డే స్కాలర్స్‌గా (138) మంది, 5వ తరగతిలో రెసిడెన్సియల్‌గా (134) మంది షెడ్యూల్డ్ కులాల బాలబాలికలను గురువారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, కలెక్టర్ కాంప్లెక్స్, కొంగరకలాన్, రంగారెడ్డిజిల్లాలో లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు.

చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలకులు రాజీవ్ చావ్రా, సెంథిల్ కుమార్‌లను రంగారెడ్డి కలెక్టర్ శశాంక గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో సన్మానించారు. - రంగారెడ్డి, జూలై 4 (నమస్తే తెలంగాణ)

ప్రభుత్వ భూమిని కాపాడాలి


ప్రభుత్వ అసైన్డ్ భూములను కాపాడాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్కేపల్లి గ్రామస్తులు

పూడూరు, జూలై 4 : వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ అసైన్డ్‌మెంట్ భూములపై ఎక్స్‌సర్వీస్ మెన్ (ఆర్మీ) అధికారుల పేర్లను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు సృష్టించి భూ దందా చేస్తున్నారని.. వారి నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ఎన్కేపల్లి గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. పూడూరు మండలం ఎన్కేపల్లి గ్రామంలోని సర్వే నం.99లో సుమారు 109 ఎకరాలకు స్థానిక రైతులకు గతంలో వ్యవసాయ సాగు చేసుకునేందుకు ప్రభుత్వం పంపిణీ చేసింది. రియల్ వ్యాపారులు గ్రామంలో నిరుపేదలను గుర్తించి వారి భూములను దౌర్జన్యంగా కబ్జా చేసి ఇతరులకు విక్రయిస్తున్నారని తెలిపారు. గ్రామంలోని సర్వే నం.99, 101ల ప్రభుత్వ భూమిని సర్వే చేసి కబ్జాదారుల నుంచి కాపాడి పేదలకు వ్యవసాయ సాగుకై ఇవ్వాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. ఆర్మీ సర్టిఫికెట్ల పేర్లతో భూ కబ్జాలో ఉన్నవారి రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని గ్రామస్తులు భీమయ్య, గంగాధర్, రవీందర్‌తో పాటు రైతులు కోరారు.

చికెన్ వ్యర్థ పదార్థాల విక్రయాల టెండర్లపై అవకతవకలు..?

మున్సిపల్ అధికారులు కుమ్మకయ్యారంటూ చికెన్ వ్యాపారుల ఆందోళన

షాద్‌నగర్‌రూరల్, జూలై 4 : చికెన్ వ్యర్థ పదార్థాల విక్రయాలపై ఇటీవలే మున్సిపల్ అధికారులు టెండర్ల ప్రక్రియకు నోటిఫికేషన్ జారీ చేశారు. కానీ మున్సిపల్ అధికారులు హైదరాబాద్‌కు, ఇతర ప్రాంతాలకు చెందిన వారితో చేతులు కలిపి వారికే టెండర్ దక్కేలా చూస్తున్నారని షాద్‌నగర్ చికెన్ దుకాణల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, చికెన్ దుకాణదారులు ఆరోపించారు. షాద్‌నగర్‌లో మొత్తం 24 చికెన్ దుకాణాలుండగా.. వాటి నుంచి నిత్యం సుమారు 2 వేల కిలోల చికెన్ వ్యర్థ పదార్థాలు వస్తుంటాయి. ఈ వ్యర్థ పదార్థాలను అనునిత్యం చికెన్ దుకాణాల నుంచి తీసుకెళ్లేందుకు మున్సిపల్ అధికారులు ప్రతి సంవత్సరం టెండర్లు నిర్వహిస్తారు. ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొనే సభ్యులు లక్ష రూపాయల డీడీ తీయడంతోపాటు, వ్యర్థ పదార్థాలను సేకరించే కంపెనీ నుంచి అనుమతి ధ్రువపత్రాలను మున్సిపల్ కార్యాలయంలో సమర్పించి టెండర్‌లో పాల్గొనాలి. దీని నిమిత్తం ఇటీవలే మున్సిపల్ అధికారులు టెండర్ ప్రకటన చేశారు. కానీ మున్సిపల్ కార్యాలయంలో టెండరు ప్రక్రియ పత్రాలను కేవలం ఒక్క రోజు మాత్రమే అంటించడంతో తమకు టెండర్ పూర్తి సమాచారం లేదని షాద్‌నగర్ చికెన్ వ్యాపారులు ఆరోపిస్తున్నారు. దీంతో రేపు (శుక్రవారం) టెండర్ ప్రక్రియలో పాల్గొనకుండా మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారని దుకాణదారులు ఆరోపిస్తున్నారు. కేవలం హైదరాబాద్‌కు చెంది వారికి ఈ టెండర్ దక్కేలా చూసేందుకే మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. శుక్రవారం నిర్వహించే టెండర్ ప్రక్రియను అడ్డుకోనున్నట్లు షాద్‌నగర్ చికెన్ వ్యాపారులు తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా.. ఇటీవలే టెండర్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను దినపత్రికల్లో ప్రచురితం చేశాం. పారదర్శకంగా టెండర్ ప్రక్రియను పూర్తిచేస్తాం. టెండర్‌కు సంబంధించిన పత్రాలు లేకుంటే అనుమతించబోం. ఇందులో ఎలాంటి అవకతవకలకు తావులేదని ఆయన తెలిపారు.

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుపై సీఎంకు లేఖ రాస్తా

మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

కొత్తూరు, జూలై 4 : లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పూర్తి కోసం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారిగా నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా కొత్తూరు మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ వద్ద గురువారం డీకే అరుణకు కొత్తూరు మండల బీజేపీ నాయకులు అమడాపురం నర్సింహగౌడ్, నాగరాజుచారి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీకే అరుణ తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొత్తూరులో పూలే విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్‌గాంధీ హిందువులను కించపరిచేలా మాట్లాడారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, బాబయ్య, రాజు, సదానందంగౌడ్, అశోక్‌గౌడ్, రణధీర్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, వెంకటేశ్, వెంకటేశ్ యాదవ్, కుర్మయ్య, శంకర్‌నాయక్, మాణిక్యం, నర్సింహయాదవ్ పాల్గొన్నారు.


ఎంపీ డీకే అరుణను సన్మానిస్తున్న కొత్తూరు బీజేపీ నాయకులు

మాట్లాడుతున్న వెంకటేశ్‌గుప్తా

కౌలు రైతులకూ వర్తింపజేయాలి

పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు, జూలై 4 : పంటలు సాగు చేసే రైతులతోపాటు కౌలు రైతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా అన్నారు. గురువారం ఆమనగల్లులోని రైతు వేదిక భవనంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో, రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌గుప్తా మాట్లాడుతూ.. సాగు చేయని గుట్టలు, వెంచర్లు, వ్యవసాయేతర పొలాలకు పంట పెట్టుబడి ఇవ్వరాదని తెలిపారు. పది ఎకరాలున్న రైతులందరికీ పథకాన్ని అందించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతులతోపాటు, కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను నాయకులు నిలబెట్టుకోవాలని కోరారు. రైతులకు అందించే ఎరువులు, విత్తనాల పంపిణీలో ప్రభుత్వం మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. పీఏసీఎస్‌ల నిర్వహణకు ప్రభుత్వం సహకరించాలని, రైతుల సంక్షేమానికి తోడ్పాటునందించాలని కోరారు. అభిప్రాయ సేకరణలో మెజార్టీ రైతులు పది నుంచి పదిహేను ఎకరాల వరకు రైతు భరోసా అందించాలని వెల్లడించారు. అనంతరం డీఆర్‌ఏవో నాగలింగంచారిని పీఏసీఎస్ పాలకవర్గం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్యం, డీఎల్‌సీ శారద, మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి, ఏఈవో స్వాతి, పీఏసీఎస్ డైరెక్టర్లు వీరయ్య, వెంకటేశ్, వెంకటయ్యయాదవ్, రమేశ్, శ్రీరాములు, దోడ్యానాయక్, శ్రీపాల్, వెంకట్‌రెడ్డి, సీఈవో దేవేందర్, సిబ్బంది పద్మాకర్‌రెడ్డి, అల్లాజీగౌడ్, మహేశ్ పాల్గొన్నారు.

ఎస్‌జీటీ

ఉచిత ఆన్‌లైన్ పరీక్షలు

వికారాబాద్, జూలై 4 : వికారాబాద్ AKR స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఎస్‌జీటీ వారికి జూలై 12, 14 తేదీల్లో సాయంత్రం 6 గంటల నుంచి 8:30 వరకు ఉచిత ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని AKR స్టడీ సర్కిల్ డైరెక్టర్ బి.వి.రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు రాయడానికి ప్లే స్టోర్ నుంచి AKR STUDY CIRCLE అనే ఆప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహించే పాటర్న్‌లో 80 మార్కులకు (160 ప్రశ్నలు) ఈ పరీక్షలు ఉంటాయన్నారు. ఎస్‌జీటీ రాసే ప్రతి విద్యార్థి ఈ పరీక్షలను ఉపయోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441022571ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

లైన్ డిపార్ట్‌మెంట్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న మలేరియా అధికారి డా.రాజేశ్

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

తుర్కయాంజాల్, జూలై 4 : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటించేలా చర్యలు తీసుకోవాలని మలేరియా అధికారి డాక్టర్ రాజేశ్ లైన్ డిపార్టమెంట్ సిబ్బందికి సూచించారు. గురువారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో వారితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటి నిల్వలు లేకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే డెంగ్యూ, మలేరియా వ్యాధులను నివారించగలమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ఎస్‌యూవో శ్రీనివాస్, సూపర్‌వైజర్ ప్రేమ్‌సింగ్, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, ఎస్‌యూవోలు హేమ్‌లాల్, ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అటవీ సంపదను కాపాడుకోవాలి

వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ సుధీర్‌కుమార్

వికారాబాద్, జూలై 4 : జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో అటవీ సంపదను కాపాడుకోవాలని వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వివిధ అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవం కార్యక్రమంలో జిల్లాలో ఈ సంవత్సరం 40.48 లక్షలు టార్గెట్ ప్రకారం మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ కూడా అటవీ భూములు అన్యాక్రాంతం కావడానికి అవకాశం ఇవ్వకూడదని, ఎక్కడైనా అన్యాక్రాంతం అవుతున్నట్లు దృష్టికి వస్తే తక్షణమే పోలీసు, రెవెన్యూ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొత్తగా అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరించాలని, ఎఫ్‌ఆర్వోలు వారి పరిధిలో అటవీ భూముల సరిహద్దులను ఏర్పాటు చేయాలని, అటవీ భూముల పరిరక్షణలో అందరూ కలిసి పని చేయాలని తెలిపారు. వనమహోత్సవం కింద నాటిన ప్రతి మొక్కా బతకాలని, మొక్కలు నాటేందుకు సరైన స్థలాలను ఎంపిక చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ సంస్థలు, రహదారులకు ఇరువైపులా తప్పనిసరిగా మొక్కలు నాటాలని, ఏ కార్యాలయం, రహదారిని కూడా మొక్కలు నాటకుండా వదలకూడదని వివరించారు. గుంతల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, జిల్లా స్థాయి కార్యక్రమంతో పాటు, నియోజకవర్గాల్లో మొక్కలు నాటేందుకు సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. సంబంధిత శాసనసభ్యులను మొక్కలు నాటే కార్యక్రమానికి ఆహ్వానించాలని, జిల్లా అధికారులు వారికి నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటడాన్ని పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు.

పీపీటీ ద్వారా అటవీ శాఖ చేసే పనులపై అధికారుల వివరణ

జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. అటవీ సంపదను కాపాడేందుకు పోలీస్, రెవెన్యూ అధికారుల సహకార మందించాలన్నారు. పీపీటీ ద్వారా అటవీ శాఖ చేసే పనులపై వివరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీవో జయసుధ ఉన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

పేద రైతుల భూముల జోలికొస్తే ఊరుకోం..

కొడంగల్, జూలై 4 : కొడంగల్ అభివృద్ధి పేరుతో పేద రైతుల భూములను తీసుకోవడం సమంజసం కాదని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇతరత్రా భూముల్లో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సామాజిక ప్రజా సంఘాలు రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని అప్పాయిపల్లి గ్రామ సర్వే నం.19లో పేద రైతులు సాగు చేసుకొంటూ జీవనం కొనసాగిస్తున్నారని, అటువంటి సాగు భూమిలో మెడికల్ కళాశాల నిర్మిస్తామని ప్రభుత్వం మొండిపట్టు పట్టడం చాలా బాధాకరంగా ఉందన్నారు. అభివృద్ధికి ఎవరూ అడ్డు కారని, పేద రైతులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి సీఎం కావడం ఓ విధంగా సంతోషపడుతున్నామని, ఆయన వల్లే భూములు కోల్పోతున్నందుకు బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. పేద రైతులకు ప్రజాసంఘాలు పూర్తి స్థాయిలో అండగా ఉన్నాయని, ఎటువంటి ఇబ్బందులను తలపెట్టినా సహించేది లేదని తెలిపారు.

కార్యక్రమంలో రైతు కూలీ పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ వెంకటయ్య, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం తాలుకా అధ్యక్షుడు రమేశ్‌బాబు, డీబీఎస్‌యూ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు చిన్నికృష్ణ, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యనాయక్, రైతులు ఫకీరప్ప, మల్లేశ్, బుగ్గప్ప, అమృతప్ప, కమలమ్మ, బుగ్గమ్మ పాల్గొన్నారు.

సఖి సెంటర్‌కు గుర్తు తెలియని మహిళ తరలింపు

మహిళను సఖి సెంటర్‌కు తరలిస్తున్న అధికారులు

చేవెళ్ల రూరల్, జూలై 4 : చేవెళ్ల మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామ సమీపం రోడ్డులో గర్భం దాల్చి మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న 35 ఏండ్ల ఓ మహిళను చేవెళ్ల పోలీసులు, మహిళా, శిశు సంక్షేమ శాఖ వసనస్థలిపురం అధికారులు గురువారం చేరదీశారు. అనంతరం మహిళను సఖి వన్ స్టాప్ సెంటర్‌కు వ్యాన్‌లో తరలించారు. ఈ సందర్భంగా చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ కథనం ప్రకారం.. ఎన్కేపల్లి గేట్ సమీపంలో గర్భం దాల్చి మతిస్థిమితం లేకుండా ఓ మహిళ తిరుగుతుందన్న సమాచారాన్ని ఏఎన్ఎం మమ్మాదేవి మహిళా, శిశు సంక్షేమ శాఖకు ఫోన్ ద్వారా సమాచారం అందించారని, దీంతో వ్యాన్ ద్వారా మహిళను సురక్షితంగా సఖి సెంటర్‌కు తరలించడం జరిగిందన్నారు. కమ్మెట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మహిళ కన్నడం మాట్లాడుతున్నదని, హైట్ 5.5, నల్లగా ఉంటుందని తెలిపారు.

నీట్ మళ్లీ నిర్వహించాలి

ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బాయికాడి శంకర్

విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మొయినాబాద్, జూలై 4 : నీట్ పేపర్‌ను లీక్ చేసిన వ్యక్తులపై తక్షణమే చట్టరీత్యా చర్యలు తీసుకుని నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బాయికాడి శంకర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌ను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల శాఖ మండల పరిధిలోని విద్యా సంస్థలను బంద్ చేయించారు. హిమాయత్‌నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల బంద్ పాటించకపోవడంతో కళాశాల ఎదుట ఆందోళన చేపట్టగా వారు కూడా కళాశాలను మూసివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజ్ కావడంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. పేపర్ లీకేజ్‌కి కేంద్ర బిందువైన నేషనల్ టెస్టింగ్